క్లుప్తంగా

కాంగ్రెస్ అభ్యర్థిగా రఘునాథ్ యాదవ్ దరఖాస్తు



గచ్చిబౌలి: శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా మారబోయిన రఘునాథ్ యాదవ్ దరఖాస్తు చేశారు. బుధవారం గాంధీ భవన్‌లో దరఖాస్తును అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాములు గౌడ్, శశికాంత్ పాల్గొన్నారు.

యువతకు టూల్‌కిట్స్ పంపిణీ



మాదాపూర్: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, సెంట్ గోబెన్ జీప్రాక్ సంయుక్తంగా నిర్వహించిన 240 మంది నిరుద్యోగ యువతకు ఫాల్‌సీలింగ్ లో 3నెలల శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించింది. వారిలో కొందరికి బుధవారం సొంతంగా (ఎంటర్‌ప్రెన్యూర్) పనులను మొదలు పెట్టి ఎదిగిన వారికి సెంట్ గోబెన్ జీప్రోక్ 4 నలుగురికి రూ. 50వేల విలువ గల టూల్ కిట్‌లను అందజేశారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్



హఫీజ్‌పేట్ : జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి బుధవారం ప్రధాన కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో జాప్యం....

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం



చందానగర్ జాతీయ రహదారిపై అసంపూర్తిగా సర్వీస్ రోడ్డు పనులు

- సర్వీస్ రోడ్డు పనులు పూర్తి కాకుండానే ఫ్లైఓవర్ నిర్మాణం పనులు ప్రారంభం
- ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు తీవ్ర అవస్థలు
- అసంపూర్తిగా రోడ్డుకు ఇరువైపుల నాలా పనులు

హఫీజ్‌పేట్ : చందానగర్ వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రణాళికంగా సాగడం లేదు. దశాబ్ద కాలం నుంచి చందానగర్, శేరిలింగంపల్లి ప్రజలు ఎదురు చూస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. కానీ ఫ్లైఓవర్ నిర్మాణం పనులు ప్రారంభించాలంటే వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ముందుగా దానికి అనుగుణంగా సర్వీస్ రోడ్డు నిర్మించాలి. కానీ చందానగర్ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న సంస్థ అలాంటి ప్రణాళికలు లేకుండా మొదట ఫ్లైఓవర్ పనులు ప్రారంభించి సర్వీస్ రోడ్డు పనులు నిర్మించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. వందల కోట్లతో రోడ్డుపై ఫ్లైఓవర్ పనులు చేపట్టేటప్పుడు పక్కా ప్రణాళికలతో ముందుగు సాగాలి. కానీ చందానగర్‌లోని జాతీయ రహదారి పనులపై అలాంటివి ఏవి కనబడడం లేదు. ఇంకా ఎన్ని సంవత్సరాలు పడుతుందో ఫ్లైఓవర్ నిర్మించడానికి అని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

సమస్యలు ఇవే...

- హైదరాబాద్, ముంబయ్ జాతీయ రహదారి కావడంతో భారీ, వ్యాపారాలు, ప్రజా రవాణా ఇవాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది.
- సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తి కాకపోవడంతో వాహనదారులు గుంతలుగా ఏర్పడిన రోడ్డుపై వెళ్తుంటే ప్రమాదాలు జరుగుతున్నాయి.
- చందానగర్ నుంచి లింగంపల్లి నాలా వరకు సర్వీస్ రోడ్డు నత్తనడన పనులు నడుస్తుండడంతో వాహనదారులు, వ్యాపారుల దుకాణాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- ఉదయం, సాయంత్రం వేళ వాహనాల రద్దీ తీవ్ర తరంతో అర కిలోమీటర్ వెళ్ళాల్సిన రహదారిపై అరగంట పడుతుతుంది. దీంతో వాహనదారుల అవస్థలు వర్ణాతీతం.
- సర్వీస్ రోడ్డు నిర్మాణం దేవుడు ఎరుగు కానీ రోడ్డు తవ్వి అక్కడ మట్టి కుప్పలుగా వేయడం వలన వాహనదారులు నరకం చూస్తున్నారు.
- రోడ్డుపై వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి సమయాలలో భారీ వాహనాల వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.
- వ్యాపారాల దుకాణాల ముందు మురుగు నీటి కోసం నిర్మిస్తున్న కాలువ అసంపూర్తిగా ఉండడంతో దుకాణాల ముందు మురుగు నీరు వస్తున్నాయి. దానివలన దుర్గంధంతో పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- చందానగర్‌లో వ్యాపారాల దుకాణాల ముందు భారి ఎత్తుతో మురుగు కాలువ నిర్మించడంతో వ్యాపారం పూర్తిగా తగ్గిపోయిందని దుకాణాదారులు వాపోతున్నారు.
- సర్వీస్ రోడ్డుపైనే వాహనాలు నిలపడం వలన తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.
- జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మిస్తున్నా సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- రోడ్డుపై దుమ్ము, ధూళితో ద్విచక్రవాహనాలదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

సమస్యలు పరిష్కరించండి ఇలా......

- త్వరతగతిన సర్వీస్ రోడ్డు పూర్తి చేయాలి
- జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మిస్తున్నట్లు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి
- దుకాణాల ముందు అసంపూర్తిగా ఉన్న మురుగు నీటి కాలువ పనులు వెంటనే పూర్తి చేయాలి
- గుంతలుగా మారిన రోడ్డుపై మరమ్మతులు చేపట్టాలి
- జాతీయ రహదారిపై తాత్కాలిక వీధి దీపాలు ఏర్పాటు చేయాలి
- వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు కలగకుండా ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి.



దుకాణాల ముందు అసంపూర్తిగా మురుగు నీటి కాలువ పనులు

కోలాహలంగా ఎమ్మెల్యే నివాసం

గచ్చిబౌలి: ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ నివాసం కోలాహలంగా మారింది. బుధవారం పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉదయం నుంచే చేరుకొని ఆయనను శాలువాలతో సత్కరించి పూలమొక్కలు, పుష్ప గుచ్ఛాలు అందించి అభినందించడం కనిపించింది. మరోసారి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా శేరిలింగంపల్లి నుంచి పోటీ చేసే అవకాశం సీఎం, బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ గాంధీకి అవకాశం ఇవ్వడం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ శేరిలింగంపల్లిలోని వివిధ డివిజన్లకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అనుబంధసంఘాల వారు అంతా చేరుకొని ఆయనకు సంఘీభావం ప్రకటిస్తున్నారు. కాగా కొందరు మైనార్టీ నాయకులు ప్రార్థనలు జరిపి గాంధీ విజయం సాధించాలని ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆయనను దీవించారు.



ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ నివాసంలో సందడి వాతావరణం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న కౌవ్ అధ్యక్షురాలు చేతన జైన్ తదితరులు



ఎగ్జిబిషన్‌లోని స్టాళ్లు

హస్త కళలకు ప్రోత్సాహం

గచ్చిబౌలి: హస్త కళలను ప్రోత్సహించేందుకు గేటెడ్ కమ్యూనిటీలలో ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామని కౌవ్(కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రీన్యూర్స్) అధ్యక్షురాలు చేతన జైన్ పేర్కొన్నారు. బుధవారం గచ్చిబౌలిలోని ఎల్అండ్‌టీ సెరేన్ కమ్యూనిటీలో 'కౌవ్ హట్' పేరిట ఒక రోజు ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గేటెడ్ కమ్యూనిటీస్‌లో నెలకో రోజు ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. దాదాపు 25 స్టాళ్లలో హస్త కథలు, దస్తులు, బెడ్ షీట్స్, జ్యూవెల్లర్స్, పెరల్స్, మెడిసన్స్ తదితర ఉత్పత్తులను ప్రదర్శన, అమ్మకాలకు ఉంచామన్నారు.

పరిశ్రమలకు కేంద్రం ప్రోత్సాహం

- మరోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తాం
- కేంద్ర సహాయ మంత్రి భాను ప్రతాప్ సింగ్



మాట్లాడుతున్న భాను ప్రతాప్ సింగ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారికి కేంద్రప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోందని కేంద్ర చిన్న, మధ్యతరహా, కుటీర పరిశ్రమల శాఖ సహాయక మంత్రి భాను ప్రతాప్ సింగ్ వర్మ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. బుధవారం పట్టణంలోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ అనేక పథకాలను ప్రవేశపెట్టారని తెలియజేశారు. స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదిగి పది మందికి ఉపాధి కల్పించేలా యువత తయారు కావాలని తెలిపారు. ఈ పరిశ్రమలను ఏర్పాటు చేసుకునే వారికి కేంద్రం సబ్సిడీలు అందిస్తోందన్నారు. ఆర్థికపరమైన సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రభుత్వం వారి స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం సక్రమంగా అమలు చేయడం లేదని విమర్శించారు. దేశంలోని వివిధ చేతి వృత్తిదారులకు వారి వ్యాపార అభివృద్ధి కోసం ఎన్డీఏ ప్రభుత్వం రూ.3 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను అందిస్తోందని గుర్తుచేశారు. రైతులకు 50 శాతం సబ్సిడీతో ట్రాక్టర్లను అందిస్తోందన్నారు. తిరిగి దేశంలో మోడీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి, దుబ్బాక నియోజకవర్గం పాలక్ అంజిరెడ్డి, పార్టీ రామచంద్రాపురం డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్ గౌడ్, భారతినగర్ డివిజన్ అధ్యక్షుడు మన్నె శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను సన్మానించిన మాజీ కార్పొరేటర్

రాయదుర్గం: బీఆర్‌ఎస్‌పార్టీ ఎమ్మెల్యేలు, పార్టీ ప్రస్తుత ఎన్నికల బీఆర్‌ఎస్ అభ్యర్థులను కలిసి గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా ఘనంగా సత్కరించారు. ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, ఎమ్మెల్యేలు కోనేరుకోనప్ప, నల్లమోతు భాస్కర్‌రావు ను బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు సీఎం కేసీఆర్ టికెట్ కేటాయించిన నేపథ్యంలో వారిని బుధవారం కలిసి సాయిబాబా శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు.

ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ డాక్టర్ శరత్

జిన్నారం(పటాన్‌చెరు): ఓటుహక్కును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ శరత్ సూచించారు. గుమ్మడిదల మండలంలోని అన్నారంలో గల ప్రకృతి నివాస్‌లో ఉంటున్న ప్రజలకు ఓటుహక్కు వినియోగించుకోవడంపై బుధవారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ఎస్పీ రమణకుమార్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఓటరు నమోదు విషయంలో బీఎల్ఓలకు తగిన సూచనలు చేశారు. అనంతరం శరత్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు తప్పకుండా ఓటరుగా నమోదు కావాలని సూచించారు. గుర్తింపు కార్డుల్లో ఏమైనా తప్పులుంటే సరిచేయించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాభవాని, ఎంపీడీఓ చంద్రశేఖర్‌తో పాటు బీఎల్‌ఓలు, అధికారులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధిలో నూతన ఆవిష్కరణలు అవసరం

రాయదుర్గం: జీవనోపాధిలో నూతన ఆవిష్కరణలు అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. సుస్థిర అభివృద్ధిపై అందరూ దృష్టి సారించాలని, జీవనోపాధి, పేదరికనిర్మూలన, అగ్రిటెక్, యువత పురోభివృద్ధి అవసరమని కూడా వక్తలు అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)లో నాల్గవ ఎడిషన్ సమావేశాన్ని నడ్జ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో 'చర్చా-23' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సెర్ప్ సంస్థ వ్యవస్థాపకులు, చైర్మన్, పద్మశ్రీ డాక్టర్ అభయ్‌సింగ్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మహీంద్రాగ్రూప్ హెచ్‌ఆర్‌ప్రెసిడెంట్ రుజ్‌బెహ్‌ఇరానీ, ప్రథమ్ సీఈఓ డాక్టర్ రుక్మిణీబెనర్జీ, సీఓఆర్‌ఎస్ సీఈఓ, వ్యవస్థాపకులు సాయిరీచాహల్, వరల్డ్‌బ్యాంక్ సీనియర్ ఎకనామిస్ట్ శ్రాయనభట్టాచార్య, వక్తలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అభివృద్ధిలో మహిళలు, యువతను భాగస్వాములను చేయాలని, వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తే ఎంతో మార్పు సాధ్యమని అభిప్రాయపడ్డారు. అనంతరం వ్యవసాయరంగంలో కూడా చాలా మార్పులు రావాల్సిన అవసరం ఉందని సమావేశంలో పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

హెచ్‌సీయూ-అనంత్ టెక్నాలజీస్ ఒప్పందం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ-మెసర్స్ అనంత్ టెక్నాలజీస్ మధ్య ఓ ఒప్పందం బుధవారం కుదిరింది. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఈ ఒప్పంద కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంత్ టెక్నాలజీస్ అనేది అంతరిక్షం, వ్యూహాత్మక రంగంలో పనిచేస్తున్న భారతదేశంలోని హైదరాబాద్ ఆధారిత మార్గదర్శక పరిశ్రమ. ట్యూనబుల్ మైక్రోవేవ్ పరికరాలు, సెన్సార్లతో హెచ్‌సీయూ వద్ద జరుగుతున్న పరిశోధన ప్రయత్నాలలో కొన్నింటికి అనుబంధం కోసం వారు హెచ్‌సీయూతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జీపీఆర్‌ఏ క్వార్టర్స్ ఫీడర్ పరిధిలోని జీపీఆర్‌ఏ క్వార్టర్స్, ఈపీటీఆర్ఐ, లక్ష్మీ ఎన్‌క్లేవ్, గ్రీన్‌లాండ్ కాలనీ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బ్రహ్మ కుమారీస్ ఫీడర్ పరిధిలోని బ్రహ్మ కుమారీస్, పుల్లెల గోపీచంద్ అకాడమీ, రాక్ ఎన్‌క్లేవ్, ఐడీబీఐ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కొండాపూర్ పరిధిలో...

కొండాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సైబర్‌హిల్స్ ఫీడర్ పరిధిలోని బాబుఖాన్ లేన్, గ్యాస్ గోడౌన్ ఆఫీస్ లేన్, శిల్ప లేఅవుట్, నాజర్‌స్కూల్ పరిసరాలలో, మధ్యాహ్నం 1 గంటల నుంచి 3 గంటల వరకు జనార్ధనహిల్స్, ప్రేరణ స్కూల్, ఎన్‌సీసీ అపార్ట్‌మెంట్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్, చందానగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైశాలినగర్ ఫీడర్ పరిధిలో వైశాలీనగర్, ఉషోదయ ఎన్‌క్లేవ్, మంజీరా పైప్‌లైన్ రోడ్డు, ఏపీఎన్‌జీఓ కాలనీ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ తెలిపారు.
- మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మదీనాగూడ ఫీడర్ పరిధిలో ల్యాండ్ మార్క్ రెసిడెన్సీ, ఆర్టీసీ కాలనీ, జెనిసిస్ స్కూల్, తులసిరాం చాంబర్స్, నైమిషా అపార్ట్‌మెంట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మియాపూర్ : శంకర్‌నగర్, ఓల్డ్ ముంబయి రోడ్డు మరమ్మత్తుల కారణంగా నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుండి 3 గంటల వరకు చందానగర్ మెయిన్‌రోడ్డు, వేమకుంట, గౌతమీనగర్, శిల్పా ఎన్‌క్లేవ్, అదేవిధంగా ఓల్డ్ ముంబాయి రోడ్డు ఫీడర్ పరిధిలోని 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు బీహెచ్‌ఈఎల్ ఏరియా, ఓల్డ్ ముంబయ్ రోడ్డు ఏరియా, వేముకుంట, చందానగర్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

హాస్టల్ భవనంపై నుంచి దూకి మహిళ ఆత్మహత్య



మల్లీశ్వరి(ఫైల్)

మియాపూర్: మానసిక సమస్యలతో బాధపడుతున్న ఓ మహిళ హాస్టల్ భవనం 5వ అంతస్తు పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ దశరథ్ తెలిపిన మేరకు.. మదీనాగూడకు చెందిన గరిమెల్ల సత్యనారాయణ కుమార్తె దుర్గా మల్లీశ్వరి(39) 2012లో విజయవాడకు చెందిన ఫణీంద్రతో వివాహం జరిగింది. దంపతులు యూఎస్‌కు వెళ్లి అక్కడే జీవనం కొనసాగిస్తున్నారు. ఆ తరువాత విడాకులు తీసుకుని విడివిడిగా ఉంటున్నారు. 2019లో దుర్గా మల్లీశ్వరి యూఎస్ నుండి వచ్చి మదీనాగూడలో తల్లిదండ్రుల ఇంట్లో ఉంటోంది. మళ్లీ యూఎస్‌కు వెళ్లేందుకు గత కొంత కాలం నుండి ప్రయత్నాలుచేస్తుంది. ఈ క్రమంలో దుర్గా మల్లీశ్వరి ఒక నెలక్రితం తల్లిదండ్రుల వద్ద నుండి వెళ్లి హఫీజ్‌పేటలోని ఎక్సోటియా ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటోంది. మానసికంగా ఒత్తిడికి లోనై బుధవారం ఉదయం ఆమె ఉంటున్న హాస్టల్ 5వ అంతస్తుపై నుండి దూకింది. స్థానికులు ఆమెను దగ్గర్లో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించి మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు కాళేశ్వరం జలాలు

గుమ్మడిదల టోల్‌గేట్ వద్ద సభలో సీఎం కేసీఆర్



గుమ్మడిదల టోల్‌గేట్ వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

జిన్నారం(పటాన్‌చెరు): కాళేశ్వరం జలాలతో ఉమ్మడి మెదక్ జిల్లాను సస్యశ్యామలం చేస్తామని, మరోసారి బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించి ఘన విజయాన్ని అందించాలని సీఎం కేసీఆర్ ప్రజలను కోరారు. బుధవారం మెదక్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వెళ్తున్న ఆయన గుమ్మడిదల టోల్‌గేట్ వద్ద ఆగారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ గుమ్మడిదల ప్రాంతంలో వ్యవసాయం ఎక్కువగా ఉంటుందని, కాళేశ్వరం జలాలతో ప్రతి ఎకరాను సాగులోకి తీసుకొస్తామన్నారు. మరోసారి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం మెదక్‌కు బయల్దేరి వెళ్లారు.

సీఎంకు ఘన స్వాగతం

సీఎం కేసీఆర్‌కు గుమ్మడిదల టోల్‌గేట్ వద్ద ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే పటాన్‌చెరు నుంచి ఓఆర్‌ఆర్ మీదుగా భారీ కాన్వాయ్‌తో గుమ్మడిదలకు చేరుకున్నారు. అన్నారం, దోమడుగు, బొంతపల్లి, గుమ్మడిదల గ్రామాల్లోని ప్రధాన రహదారిపై భారీగా స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. బోనాలు, గుర్రాల స్వారీలు, పోతరాజుల విన్యాసాలు, గంగిరెద్దుల ప్రదర్శనలు, పీర్ల ఊరేగింపు, కోలాటం, ఒగ్గు కళాకారులు, కోయల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మధ్యాహ్నం 1.40కి కేసీఆర్ గుమ్మడిదలకు చేరుకున్నారు. ఎస్పీ రమణకుమార్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి హరీష్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్ మంజు, ఎంపీ కొత్తప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ శరత్, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీపీ ప్రవీణ, హుస్సేన్ పాల్గొన్నారు.



బోనాలతో మహిళలు



కోయ దప్పు వాయిస్తున్న ఎమ్మెల్యే